క్లుప్తంగా

ఘనంగా ఆవుల జాతర



పూజలందుకుంటున్న చిత్రలింగేశ్వరస్వామి

బ్రహ్మసముద్రం: మండలంలోని ఎర్ర కొండా పురంలో సోమవారం ఆవుల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవుల కుల దైవం చిత్రలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం గ్రామ సమీపంలోని ఆవుల గూడు వద్ద చిత్ర లింగేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను కొలువు దీర్చి గ్రామంలోని పశువులను గూడు చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఇలా చేయడం ద్వారా పశువులు ఎటువంటి వ్యాధులు దరిచేరవని గ్రామస్తుల నమ్మకం. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చెన్నమల్లప్పస్వామి ఆలయంలో పూజలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: మండలంలోని సూగేపల్లిలో ఉన్న అరూఢ చన్న మల్లప్ప స్వామి ఆలయంలో కార్తీక పరుష సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పీఠాధిపతి చన్నమల్లప్ప స్వామి ఆధ్వర్యంలో శివలింగానికి రుద్రాభిషేకం, భిల్వార్చనం, శాంతిహోమం, చేపట్టారు. మధ్యాహ్నం స్వామి దర్శనం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా వెండి పల్లకీ ఉత్సవం



స్వామి గ్రామోత్సవం

కుందుర్పి: మండలంలోని కొలిమిపాళ్యంలో సోమవారం వెండి పల్లకీ ఉత్సవం, తోపులో జాతరతో మచ్చంద్రమయ్య స్వామి జాతర ఉత్సవాలు ముగిశాయి. సాయంత్రం స్వామిని వెండి పల్లకీలో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ముత్యాలపల్లకీ ఊరేగింపు



ముత్యాలపల్లకీలో ఊరేగుతున్న ఈశ్వరుడు

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు గ్రామంలో ఈశ్వరస్వామిని సోమవారం రాత్రి ముత్యాలపల్లకీలో ఊరేగించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌కు రుద్రాభిషేకం, ఆకుపూజ, మహామంగళారతి, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ చేపట్టారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో తీసుకువచ్చి ముత్యాలపల్లకిలో అధిష్టించి గ్రామంలో ఊరేగించారు. దేవదాయ దర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాలపల్లకి ఉత్సవాన్ని చూసేందుకు గ్రామప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు



అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

కూడేరు: అయోధ్య రామాలయానికి సంబంధించిన అక్షింతలను అయోధ్య తీర్థ ట్రస్టు సభ్యుడు సుదర్శన్ ఆధ్వర్యంలో సోమవారం కూడేరుకు తీసుకువచ్చారు. అక్షింతలను కూడేరులో స్టేట్ బ్యాంక్ నుంచి రామాలయం వరకు మంగళవాయిద్యాల నడుమ భక్తులు రామనామస్మరణ చేస్తు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్షింతలను ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత మండలంలోని పలు గ్రామాలకు ఆ అక్షింతలను రామభక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యుడు పురుషోత్తం, భక్తులు పాల్గొన్నారు.

ప్రేమ, క్షమ క్రీస్తు సందేశం

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఏసు ప్రభువు బోధించిన ప్రేమ మార్గంలో పయనించి జీవితానికి సార్థకత చేకూర్చుకోవాలని పాస్టర్లు సందేశమిచ్చారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చర్చీల్లో చిన్నారులు ఆలపించిన ఏసు భక్తి గీతాలు అలరించాయి. అలాగే ప్రార్థనా మందిరాల్లో విద్యుత్ దీపాలతో అలంకరించిన మేరీమాత, బాల ఏసు ప్రతిమలు, క్రిస్మస్ ట్రీ, పశువుల పాక నమూనాలు ఆకట్టుకున్నాయి.



రాయదుర్గం క్రైస్ట్ చర్చిలో పేదలకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



ఉరవకొండ సీఎస్ఐ చర్చిలో పాస్టర్ ప్రమీలా జోసఫ్‌కు కేక్ తినిపిస్తున్న యువనేత ప్రణయ్‌రెడ్డి

- చర్చీల్లో భక్తిశ్రద్ధలతో క్రిస్మస్
- వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గంటౌన్: ప్రేమ, క్షమ క్రీస్తు సందేశమని, అలాంటి క్రీస్తు బోధనలతో మానవుడు సన్మార్గంలో నడవాలని పాస్టర్లు సందేశమిచ్చారు. క్రైస్తవుల ఆరాధ్యదైవం ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను సోమవారం రాయదుర్గం పట్టణంలోని చర్చిల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని డాక్టర్ ఎస్ అర్ జాన్ మెమోరియల్ బాపిస్టు చర్చి, సెయింట్ మేరీమాత చర్చి, ఎఫ్రతా ప్రార్థన మందిరం, గిల్లాలు చర్చి, కేఎస్ క్రైస్ట్ చర్చి, జీసస్ కాలింగ్ మిని స్ట్రీస్, క్రైస్ట్ ప్రార్థన మందిరం, మెస్సయ్య మెరికాల్ చర్చీల్లో పాస్టర్ల ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఉరవకొండ: ఏసు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా అన్ని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను సోమవారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో పాస్టర్ ప్రమీలా జోసఫ్ క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. ప్రార్థనల్లో పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, పార్టీ యువనేత ఏసీ పవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ప్రణయ్‌రెడ్డి కట్ చేశారు. ప్రణయ్ మాట్లాడుతూ సీఎస్ఎస్ చర్చి అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరయ్యేలా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, ఉరవకొండ, వజ్రకరూరు సర్పంచ్‌లు లలితమ్మ, మోనాలిసా, ఉపసర్పంచ్ వన్నప్ప, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, నాయకులు చందా చంద్రమ్మ, సలీం, ఆసీఫ్, వడ్లసలీం, వన్నూర్‌సాబ్, వడ్డే ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం పంచాయతీ పరిధిలోని ఆయతపల్లి చర్చిలో పాస్టర్ రెవరెండ్ ప్రకాష్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణారెడ్డి, క్రైస్తవులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లోని క్రైస్తవులు క్రిస్మస్ ఘనంగా నిర్వహిచారు.

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, గోవిందవాడ తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రార్థనలు చేశారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసు ప్రభువు ప్రవచనాలను పాస్టర్లు చదివి వినిపించారు

కళ్యాణదుర్గం: మండలంలోని ఆయా గ్రామాల్లో క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగాయి.పట్టణంలోని సీఆండ్‌బీ మిషన్ చర్చితో పాటు పలు ప్రార్థన మందిరాల్లో క్రైస్తవులు వేడుకలను భక్తి శ్రద్దలతో నిర్వహించారు.ఈ సందర్భంగా పాస్టర్లు బైబిల్ సందేశాన్ని భక్తులకు వినిపించారు.

కంబదూరు: క్రిస్మస్ సందర్భంగా మండల వ్యాప్తంగా క్రైస్తవులు ఉదయమే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.స్థానిక సీఆండ్‌బీ మిషన్ చర్చిలో పాస్టర్ జేమ్స్, ములకనూరు బెరాక ప్రార్థన మందిరంలో పాస్టర్ ప్రభుదాసు క్రీస్తు జననం గురించి భక్తులకు వివరించారు కార్యక్రమంలో సంఘ పెద్దలు దినకర్, జాన్ శాస్త్రి, ప్రభుదాసు, ఎస్.పాల్, విజయ్‌కుమార్, జకరయ్య, జాకబ్, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని ఎల్‌ఈఎఫ్ చర్చిలో పాస్టర్ ఎలీషా ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థలు చేపట్టారు. అలాగే మండల వ్యాప్తంగా చర్చిల్లో కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కుందుర్పి: మండలంలోని మలయనూరు, కుందుర్పి, అప్పిలేపల్లి, నిజవల్లి, జంబుగుంపల, ఎనుములదొడ్డి తదితర గ్రామాల్లో క్రైస్తవులు చర్చిలను అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. కుందుర్పిలో ఏసును ప్రార్థిస్తూ కొవ్వొత్తులతో గ్రామోత్సవం నిర్వహించారు.

శెట్టూరు: మండలంలోని శెట్టూరు, కనుకూరులు, అనుంపల్లి, బచ్చేహళ్ళి, అయ్యగార్లపల్లి, లక్ష్మంపల్లి గ్రామాలలోని క్రైస్తవులు క్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యకమంలో పాస్టర్లు, డేవిడ్, విజకుమార్, లక్ష్మన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు టైలర్ వన్నూరుస్వామి, లింగప్ప, హరినాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని జల్లిపల్లి(హోసన్నా చర్చి), కలగళ్ల, కూడేరు(బేతనీయ, కవనెంట్ చర్చిలో), ముద్దలాపురం, అరవకూరులోని చర్చిల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు ఎర్రిస్వామి, డేనియల్, పాలు, విక్టర్, సువర్ణ రాజు క్రిస్మస్ విశిష్టతను వివరించారు.

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్లు డానియల్ వినయ్‌కుమార్, ప్రమీలాజోసేఫ్, సోనిసౌజన్య తదితరులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సీఎస్ఐ సంఘ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని తగ్గపర్తి, బెళుగుప్ప, కాలువపల్లి, కోనంపల్లి, శీర్పి, గంగవరం, అంకంపల్లి, హనిమరెడ్డిపల్లి, నరసాపురం గ్రామాల్లోని చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తగ్గపేర్తి గ్రామంలోని చర్చిలో పాస్టర్ కుళ్లాయిస్వామి ప్రత్యేక ప్రార్థనలు చేసి చిన్నారులతో చర్చిలో కేక్ కట్ చేశారు.

క్రిస్మస్ వేడుకల్లో విప్

రాయదుర్గం టౌన్: పట్టణంలోని రాజీవ్ గాంధీ కాలనీలోని క్రైస్ట్ చర్చి, కింగ్ ఆఫ్ షాలెమ్ క్రైస్ట్ చర్చి, గిల్లాలు చర్చీల్లో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరయ్యారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, దయ, శాంతి మార్గాలను చూపిన ఏసుక్రీస్తు జీవితం అందరికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, కౌన్సిలర్ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ అరవాశివప్ప, గంగాధర్, క్రైస్ట్ చర్చి సంఘం అధ్యక్షుడు కొలిమి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: ఏసు ప్రభువు మార్గం అనుసరణీయమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. కణేకల్లులోని సీయోను చర్చిలో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విప్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన పేదలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం పాస్టర్ మత్తయ్య, సర్పంచు దంపతులు నిర్మల, డాక్టర్ సోమన్న తదితరులు విప్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ కేశవరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, మండల జేసీఎస్ కన్వీనర్ హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కెనిగుంట రామిరెడ్డి, బోయ రమేష్, మారెంపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కణేకల్లులోని సీయోను చర్చిలో పేదలకు చీరలను పంపిణీ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి



జీసస్ కాలింగ్ మినిస్ట్రీస్‌లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



బొమ్మనహాళ్ మండలం గోవిందవాడ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కూడేరు మండలం జల్లిపల్లిలో హోసన్నా కృప చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



బ్రహ్మసముద్రంలోని ఎల్‌ఈఎఫ్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కంబదూరులో వాక్యాన్ని బోధిస్తున్న పాస్టర్ జేమ్స్



బెళుగుప్ప మండలం తగ్గుపర్తిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



కుందుర్పిలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



శెట్టూరులోని విశ్వవాణి చర్చిలో కేక్ కట్‌చేస్తున్న దృశ్యం



గుమ్మఘట్ట మండలం గోనబావిలో వస్త్రదానం చేస్తున్న క్రైస్తవులు



రాయదుర్గం మండలం ఆయతపల్లిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి

నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా'



కూడేరు: కమ్మూరు వద్ద క్రికెట్ ఆడేందుకు మైదానం సిద్ధం చేస్తున్న అధికారులు



వజ్రకరూరు: ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయలలిత

రాయదుర్గం: యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలంటూ మున్సిపల్ కమీషనర్ దివాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాయదుర్గం జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం ఉదయం 10:30 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. రాయదుర్గం అర్బన్ పరిధిలో వాలీబాల్ 18 జట్లు, కబడ్డీ 33, బ్యాట్మిటన్ 98, క్రికెట్ 93 ఖోఖో 15 జట్లు పాల్గొంటాయన్నారు. మంగళవారం నుంచి 2024 ఫిబ్రవరి 10 వరకూ క్రీడా పోటీలు సాగుతాయన్నారు. నియోజకవర్గంలోని డి హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాల్లోనూ మంగళవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభించనున్నట్టు ఆయా మండలాల ఎంపీడీఓ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు, నాయకులు భాగస్వాములై 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను విజయవంతం చేయాలన్నారు.

ఆవులదట్లలో..

రాయదుర్గం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని మండలంలోని ఆవులదట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ కొండయ్య తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు , కో ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరుకావాలని ఆయన కోరారు.

1,682 మంది క్రీడాకారుల రిజిస్ట్రేషన్

కూడేరు: మండలంలో మంగళవారం నుంచి ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు 1,682 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఎంపీడీఓ ఎంకే బాషా సోమవారం తెలిపారు. అందులో కబడ్డీ ఆడేందుకు 367 మంది, వాలీబాల్‌కు 176 మంది , ఖోఖోకు 101 మంది, క్రికెట్‌కు 943 మంది , బ్యాట్మింటన్‌కు 95 మంది చొప్పున ఉన్నారన్నారు. పోటీల నిర్వాహణకు మైదానాలను సిద్ధం చేశామన్నారు.

విజయవంతం చేయండి

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని సచివాలయాల పరిధిలో మంగళ వారం నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని కేవీ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానంలో ఏర్పాట్లను ఎంపీడీఓ పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పోటీల్లో మండలంలో మొత్తం 85 జట్లు పాల్గొంటాయన్నారు.

గిరిజన హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కృషి



గిరిజనుల శంఖారావం సభ పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: రాష్ట్రంలో గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్ ఆధ్వర్యంలో 2024 జనవరి 7 విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిరిజనుల శంఖారావం సభకు సంబంధించిన పోస్టర్ల విడుదల చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కలసికట్టుగా ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు గోవిందునాయక్, రాష్ట్ర జీపీఎస్, జీవీఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి నగర సంకీర్తన

రాయదుర్గంటౌన్: పట్టణంలో మంగళవారం అయ్యప్పస్వామి నగరసంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. శాంతినగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద నుంచి స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తామన్నారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అయ్యప్పస్వామి మాలధారులు, భక్తులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నారాయణపురంలో ఉద్రిక్తత

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని నారాయణపురంలో సోమవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆదివారం ద్విచక్రవాహనం మరమ్మతు విషయంలో జరిగిన ఘర్షణలో రామాంజనేయులు అనే వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం దాడిచేసిన ప్రభాకర్ అనే వ్యక్తి ఇంటివద్ద మృతి చెందిన రామాంజనేయులు కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ నాగరాజు, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి ఇరు కుంటుబాలకు సర్ది చెప్పడంతో ఘర్షణ సద్దుమణిగింది.

పాడి ఆవుల మృతి

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప తండాలో గిరిధర్‌నాయక్‌కు చెందిన రెండు పాడి ఆవులు సోమవారం యూరియా ద్రావణం త్రాగి మృతి చెందాయి. బాధిత రైతు వివరాల మేరకు.. రోజులాగే రెండు ఆవులను సోమవారం గ్రామ సమీపంలోని తోట వద్దకు మేపునకు తీసుకెళ్లాడు. పొలంలో పిచికారీ కోసం తొట్టెలో ఉంచిన యూరియా ద్రావణాన్ని ఆవులు తాగాయి. వెంటనే పశువైద్యాధికారి రమేష్‌కు సమాచారం అందించగా.. అధికారులు చేరుకొనే సమయానికే ఆవులు మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.లక్ష పైగా నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. అధికారులు స్పందించి ఆదుకోవాలన్నాడు.

నెట్టికంటుడిని దర్శించుకున్న హంపీ పీఠాధిపతి

గుంతకల్లు రూరల్: హంపీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతీ స్వామీజీ సోమవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. హనుమద్ వ్రతం ఉత్సవాల అనంతరం ఆలయ ప్రాంగణంలోని బెల్డోణ సత్రంలో బెల్డోణ రామనాథ శాస్త్రి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏటా దత్త జయంతి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. ఈక్రమంలో సోమవారం జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం హంపీ పీఠాధిపతి కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులకు ఆశీర్వచనాలను అందజేశారు.

అ'పూర్వ' కలయిక

కుందుర్పి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరానికి చెందిన పదోతరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి మధుర క్షణాలు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత పూర్వ ప్రదానోపాధ్యాయుడు అశ్వరప్ప,అప్పటి ఉపాధ్యాయులు గురు శిద్దమూర్తి, కిష్టప్ప, వెంకటేశులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు